ప్రజాశక్తి
గురువారం 25 సెప్టెంబర్ 2025 5
విజయనగరం

ఉత్సవాల్లో కళా ప్రదర్శనలకు అవకాశం

ఈనెలాఖరులోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాల్లో అక్టోబర్ 5,6 తేదీలలో స్థానిక మహారాజా సంగీత కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెన్యూ ఇన్‌చార్జి ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన దలచిన వారు తమ వివరాలను సంగీత నృత్య కళాశాలలో ఈనెల 30లోగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల అందజేయాలని తెలిపారు. క్లాసికల్, సెమి క్లాసికల్, భక్తి సంగీతం బృంద నృత్యాలకు మాత్రమే అవకాశం ఉందని, ప్రతి బృందం ప్రదర్శనకు 15 నిముషాలు లోపల సమయం కేటాయిస్తామని తెలిపారు. ఎంపిక చేసిన బృందాలకు ప్రదర్శించ వలసిన తేదీ, సమయం టెలిఫోన్ ద్వారా తెలియజేస్తామన్నారు. వివరాలకు 63002 18551 సునీల్ కుమార్‌ను , 93986 27642 గణేశ్ ను సంప్రదించాలని తెలిపారు.

శిథిలావస్థలో క్షయ నివారణ కార్యాలయం

- ఊడుతున్న స్లాబ్ పెచ్చులు..కుంగిపోయిన ఫ్లోరింగ్
- వర్షం వస్తే జలమయం
- బితుకు బితుకుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

పెచ్చులూడిన కార్యాలయం లోపలి భాగం

శిథిలావస్థకు చేరిన క్షయ నివారణ కార్యాలయం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరం జిల్లా కేంద్రంలో గల జిల్లా క్షయ నివారణ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది .1990లో నిర్మించిన ఈ భవనం నేడు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతుందా అన్నట్లు ఉంది. వర్షం పడితే చాలు కార్యాలయం తడిసి ముద్దవుతుంది. విజయనగరం జిల్లాకు సంబంధించిన క్షయ నివారణ మందులు, వైద్య పరికరాలు వైద్య సేవలు కూడా ఈ కార్యాలయం నుంచే అందిస్తారు. ఇక్కడి నుంచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కపం పరీక్షలకు సంబంధించిన ప్లాస్టిక్ బాక్సులు తరలిస్తుంటారు. అంతేకాకుండా వందల సంఖ్యలో రోగులు ప్రతిరోజు జిల్లా క్షయ నివారణ కార్యాలయానికి వచ్చి పలు పరీక్షలతో పాటు వైద్య సేవలు పొందుతుంటారు. అంతటి ప్రాధాన్యత గల కార్యాలయం నేడు గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాధుడే కొరువయ్యారు. భవనం నిర్మించి 35ఏళ్లు కావడంతో స్లాబ్ పెచ్చులూడిపోయింది. కింద ఫ్లోరింగ్‌గా వేసిన టైల్స్ ఊడిపోయి కిందకు దిగిపోయింది. మరోవైపు ఎక్కడికక్కడ బీటలు వారడం, వర్షం పడితే తడిచిపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విష జంతువులు సైతం అప్పుడప్పుడూ వచ్చేస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఈనేపథ్యంలో వారంతా బితుకు బితుకు మంటూ విధులు నిర్వహిస్తున్నారు. గచ్చు పెచ్చులు కూడా ఊడిపోయి చిందర వందరగా పడి ఉన్నాయి. వర్షం పడిందంటే చాలు జిల్లా క్షయ నివారణ కార్యాలయం తడిసి ముద్దవుతుంది. కార్యాలయంలో రికార్డులు భద్రపరిచేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో అత్యంత ప్రాధాన్యత గల జిల్లా క్షయ నివారణ కార్యాలయంకు మంచి భవనం లేకపోవడంతో రోగులు ఆసుపత్రికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా మంత్రి, కలెక్టర్, జిల్లా అధికారులు కలుగజేసుకొని జిల్లా క్షయ నివారణ కార్యాలయాన్ని వేరొక భవనంలోకి తరలించడం లేదా కొత్త భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా క్షయ నివారణ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. స్లాబ్ పై పెచ్చులు ఊడిపోవడం, ఫ్లోరింగ్ గచ్చు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయం చిందర వందరగా తయారయ్యింది. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నూతన భవనం నిర్మించడం లేదా వేరొక భవనంలోకి మార్చాలని ప్రతిపాదనలు పంపించాం.

ఎన్ రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి విజయనగరం

కోలాహలంగా సిరిమాను తరలింపు

దారి పొడవునా నీరాజనాలు

ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి : మంత్రి కొండపల్లి

సిరిమాను చెట్టుకు గొడ్డలితో గాటు పెడుతున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ/విజయనగరంటౌన్

పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గంట్యాడ మండలం కొండ తామరాపల్లి గ్రామంలో గుర్తించిన పైడితల్లి అమ్మవారికి ప్రతిరూపంగా భావించే సిరిమాను చెట్టును మంత్రి శ్రీనివాస్ బుధవారం సతీసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయద్వానాల, మధ్య చెట్టుకు గొడ్డలితో గాట్లు పెట్టి సిరిమాను తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అనంతరం అక్కడి నుంచి విజయనగరంలోని పూజారి నివాసముంటున్న హుకుంపేటకు సిరిమానును తరలించారు. అడుగడుగునా ప్రజలు సిరిమానుకు నీరాజనాలు పట్టారు. పలు కూడలిలో మంత్రి సౌజన్యంతో గంట్యాడ టిడిపి మండల అధ్యక్షులు భాస్కరరావు 20వేల మజ్జిక ప్యాకెట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో అమ్మవారి సిరిమాను పండగను, విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అమ్మవారు రాష్ట్రాన్ని చల్లగా చూడాలని, పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగాలు రావాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, ఆర్‌డిఒ డి.కీర్తి, పైడితల్లి అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్ కె.శిరీష, డిఎఫ్ఒ కొండలరావు, డిఎస్‌పి గోవిందరావు, తాహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, వైసిపి నాయకులు కోలగట్ల వీరభద్ర స్వామి, కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు, చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర, ఇరుసుమాను చెట్ల దాతలైన రైతులు చల్లా అప్పలనాయుడు, నారాయణమూర్తి, రామకృష్ణ, లోకవరపు సత్యం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జన కోలాహలం మధ్య సిరిమానును విజయనగరం తరలిస్తున్న దృశ్యం

నియామకపత్రాలు అందుకునేందుకు

డిఎస్‌సి ఉపాధ్యాయ అభ్యర్థులు విజయవాడ పయనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెగా డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను విజయవాడలో ఈనెల 25న అందజేయనున్న నేపథ్యంలో వారంతా అధికారులు ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. మోదవలస వద్ద ఓయస్టర్ స్కూల్ నుంచి బుధవారం 36 బస్సుల్లో 696 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు వెళ్లారు. వారికి సహాయకారిగా వారి కుటుంబం నుండి ఒకరు చొప్పున, 20 మంది ఎస్కార్ట్ ఆఫీసర్లు, 12 మంది మెడికల్ ఆఫీసర్లు, ఒక్కొక్క బస్సుకు ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లు, ప్రతి బస్సుకు ఒకరు చొప్పున పోలీసు సిబ్బంది మొత్తంగా 1600 మంది వెళ్లారు. వీరంతా విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా నియామక పత్రాలను అందుకోనున్నారు. ఈ బస్సులను జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. అభ్యర్థులతో పాటు విజయనగరం, మన్యం జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారులు, సర్వశిక్ష ఎపిసి, ఉప విద్యాశాఖాధికారులు వెళ్లారు.

జాతీయ పికిల్ బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జమ్మూలో ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు జరగనున్న తొమ్మిదవ జాతీయ స్థాయి పికిల్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు బయలుదేరింది. మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు ఆంధ్రా జట్టుకు నాయకత్వం వహిస్తున్నారు. గత నెల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సుజయ్ కృష్ణ రంగారావు పురుషుల విభాగంలోను అటు 50ప్లస్ డబుల్స్ లో విజేతగా నిలిచి, జాతీయ స్థాయికి అర్హత సాధించారు. ఆయనతో పాటు బొబ్బిలికి చెందిన బదరి రావు 50ప్లస్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జమ్ము జాతీయ స్థాయి పోటీకి అర్హత సాధించారు. వీరిద్దరూ కలసి జమ్మూలో 50ప్లస్ డబుల్స్ విభాగంలో తలపడనున్నారు. వీరితోపాటు రాజాం నుండి కృష్ణంరాజు, అరుణ్ జంట 50ప్లస్ డబుల్స్ విభాగంలో పోటీపడనుండగా, విజయవాడకు చెందిన శ్రీధర్ 35ప్లస్ సింగిల్స్ విభాగంలో జాతీయ వేదికపై సత్తా చాటేందుకు సంసిద్ధమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడాశాఖ, వివిధ క్రీడా సంఘాలు, అభిమానులు ఆంధ్ర జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎరువుల దుకాణంపై 6ఎ కేసు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంతకవిటి మండల కేంద్రంలోని ఓం శ్రీవినాయక ఎరువుల దుకాణంపై 6ఎ కేసు నమోదు చేసి, రూ.13.62 లక్షల విలు వైన సరకును సీజ్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. డిఎపి, 16:16:16, ఎంఒపి ఎరువుల బిల్లులు చెల్లిం చకుండా అమ్మకాలు చేసినట్లు గుర్తించామని చెప్పారు. ఈ- పోస్ యంత్రంలో ఉన్న నిల్వలకు, దుకాణంలో ఉన్న సరకుకు వ్యత్యాసం ఉందన్నారు. రూ.39,650 విలువ చేసిన 23 బస్తాలు తేడా ఉండడంతో మిగతా ఎరువులు సీజ్ చేశామ న్నారు. వాటిని పక్కనున్న మరో దుకాణానికి అప్పగించామని, పూర్తిస్థాయి నివేదికను జేసీ విచారణ జరిపి రూ 15వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళల రిప్రొడక్టివ్ హెల్త్ పై ప్రత్యేక హెల్త్‌టాక్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మిమ్స్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి. నవీనా, మహిళల రిప్రొడక్టివ్ హెల్త్, హెచ్‌పివి వ్యాక్సిన్, మహిళల ఆరోగ్య పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మిమ్స్ పిజి స్టూడెంట్ డాక్టర్ వాసవిక పిసిఒడిపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామయ్య, మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే మూడో లైన్ పనులను పరిశీలించిన డిఆర్ఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

పనులపై ఆరా తీస్తున్న డిఆర్ఎం అంకుష్‌గుప్తా

రైల్వే మూడో లైన్ పనులను విశాఖపట్నం డిఆర్ఎం అంకుష్ గుప్తా, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాత్రో బుధవారం పరిశీలిం చారు. పెంట బ్రిడ్జి వద్ద పనులను, రైల్వే గేటులను పరిశీలిం చారు. రైల్వే స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడో లైన్ ట్రాక్ పై ప్రత్యేక రైలు ద్వారా పరిశీలన బాగుందని అధికారులు బృందం సభ్యులు చెప్పారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ మృదంగ విద్వాంసులు సత్యం మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

సత్యం (ఫైల్)

విజయనగరానికి చెందిన ప్రముఖ సీనియర్ మృదంగ విద్వాంసులు వెంపడాపు సత్యం (76) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కోలంక వెంకటరాజు, కాట్రావులపల్లి వీరభద్ర రావుకు శిష్యులు. ప్రత్యేకించి హరికథకు సత్యం మృదంగ సహకారం మరువలేనిది. వేలాది హరికథలకు మృదంగ సహకారం అందించారు. ఆయన మృతికి మృదంగ విద్వాంసులు వి .అప్పలస్వామి, డాక్టర్ మండపాక రవి, రాధాకృష్ణ, శివకుమార్, మహేశ్వర రావు తదితరులతోపాటు, వివిధ విద్వాంసులు కాళ్ళ నిర్మల భాగవతారిణి, రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, వయొలిన్ విద్వాంసులు త్రినాథరావు, సుబ్బరాజు తదితరులు సంతాపం తెలిపారు.

మెరుగైన సేవలు అందించండి : కలెక్టర్

సచివాలయం, ఆర్‌డిఒ, ఎంపిడిఒ కార్యాలయాలు పరిశీలన

గరివిడి : సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గరివిడి/చీపురుపల్లి

సచివాలయ సిబ్బంది సకాలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం గరివిడి మండలం కొండపాలెం సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను పరిశీలించి సిబ్బంది సమయానికి విధుల్లో హాజరై, ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య విభాగంపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, వ్యాక్సినేషన్లు, ఇమ్యూనైజేషన్ షెడ్యూల్ ప్రకారం తప్పనిసరిగా అందించాలన్నారు. గర్భిణుల పట్ల మరింత శ్రద్ధ చూపాలని, గర్భధారణ నుంచి ప్రసవం వరకు ప్రతి దశలో క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేసి, ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన మంచినీటి సరఫరా నిరంతరంగా కొనసాగాలని, ఎక్కడా నీటి కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయడం ద్వారా ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని, నాణ్యమైన మరియు వేగవంతమైన సేవలందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందుగా కలెక్టర్ చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయాలను సందర్శించారు. అక్కడ ఆర్‌డిఒ, తాహశీల్దార్, ఎంపిడిఒ, డిఎస్‌పి, ఇతర అధికారులతో సమావేశమై, ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. రైతులకు ఎరువుల సరఫరా సజావుగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో వ్యవసాయానికి అవసరమైన సహకారం అందించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా ప్రతి విభాగం సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.ఆశయ్య, తాహశీల్దార్ డి.ధర్మరాజు, ఎంపిడిఒ సురేష్, డిఎస్‌పి రాఘవులు ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వినతులపై సానుకూలంగా స్పందించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజల నుంచి అందిన రెవిన్యూ వినతులకు సానుకూలంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. వినతులపై ప్రజల సంతృప్తి పెరగాలని అన్నారు. ఒక దరఖాస్తును తిరస్కరిస్తే అందుకు గలా కారణాలను అర్జీదారుకు వివరించాలని తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణ, రీ సర్వే, పిజిఆర్ఎస్, హౌస్ సైట్స్ , మ్యుటేషన్లు, ఆర్ఒఆర్ తదితర అంశాల పై మండల వారీగా సమీక్షించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితా తో 2025 ఓటర్ల జాబితాను మాప్ చేయాలని తెలిపారు. ఓటర్ల సవరణ కోసం అందిన ఫారం 6,7,8 లను నిర్దేశిత గడువు లోగా డిస్పోజ్ చేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ఈ-ఆఫీస్ ద్వారా వారి కరెస్పాండెన్స్ చేయాలని, దీనివలన రికార్డు భద్రతగా ఉంటుందని తెలిపారు. ఈ ఆఫీస్‌పై వర్కుషాప్ నిర్వహించి, త్వరలో అధికారులందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు. జేసీ సేదు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒలు, డిప్యూటీ కలెక్టర్లు, సర్వేశాఖ ఎడి, తహశీల్దార్లు, సర్వేయర్లు, డిటిలు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య సేవలు అందించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ జాతర, విజయనగర ఉత్సవాల నేపథ్యంలో నగరంలో పారిశుధ్యపరంగా సంపూర్ణ సేవలు అందించాలని ప్రజారోగ్య సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య నిర్దేశించారు. బుధవారం తన ఛాంబర్ లో పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడితలమ్మ జాతర, ఉత్సవాలకు 1200 మంది ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసామని చెప్పారు. నేటి నుండి ప్రజారోగ్య సిబ్బందికి శెలవులు మంజూరు చేయడం లేదని చెప్పారు. గతం కన్నా మిన్నగా పారిశుధ్య సేవలు ఉండాలని అన్నారు. ఎక్కడా వీధులలో చెత్తలు లేకుండా చూడాలన్నారు. కాలువలలో మురికి పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలని చెప్పారు. ఇంటింటి చెత్త సేకరణ 98శాతం మించి ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా మురికివాడల ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు అచ్చిరెడ్డి, సాలెంరాజు, రామకష్ణ, రవి శేఖర్, రామారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యుత్ ఉద్యోగుల సొసైటీ మహాజన సభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహాజన సభలో నివేదికను ప్రవేశపెడుతున్న అధ్యక్షులు రామునాయుడు

శ్రీ వెంకటేశ్వర విద్యుత్ ఉద్యోగుల కో- ఆపరేటింగ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ బుధవారం దాసన్నపేట 1104 యూనియన్ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షులు పి.రాము నాయుడు అధ్యక్షతన జరిగింది. మహాజన సభలో ఏప్రిల్ 2నుండి ఆగస్టు 31వ తేదీ వరకు జరిగిన ఆర్థిక కార్యకలాపాలు నివేదికను అధ్యక్షులు రామునాయుడు ప్రవేశపెట్టిగా, కార్యదర్శి బి.కూర్మారావు బలపరచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. విద్యుత్ ఉద్యోగుల సొసైటీ సభ్యులకు అడిగిన వెంటనే అర్హతను బట్టి రుణాలు ఇస్తున్నామని,ఆర్టికల్, ఎడ్యుకేషన్, మెడికల్ అడ్వాన్స్ కూడా ఇస్తున్నామని తెలిపారు. సొసైటీ కుటుంబీకుల్లో 10వ తరగతి, ఇంటర్, ఐఐటి, మెడికల్ సీటు సాధించిన పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. సభ్యులు ఎవరైనా చనిపోతే దహన సంస్కరణ ఖర్చు నిమిత్తం రూ.10వేలు ఇస్తున్నామన్నారు. సభ్యులలో పొదుపుపై అవగాహన పెంచుతున్నామన్నారు. మహాజనసభలో పూర్వపు అధ్యక్షులు డిఆర్ఎస్‌వి ప్రసాద్ గారు, పూర్వపు ఉపాధ్యక్షులు డి.రాజేంద్రప్రసాద్ , 1104 యూనియన్ రీజనల్ సెక్రెటరీ ఎస్.లక్ష్మణ్ , హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు కెవికె నాగరాజు మాట్లాడారు. ఉపాధ్యక్షులు జి అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శి ఎ రవి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్ పైడిరాజు, యస్ మురళీ, ఎన్ రమణ, కె రాజశేఖర్, జి.అప్పలసూరి పాల్గొన్నారు.

ఇంటి పన్ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎల్‌బిజి నగర వాసులు

పెంచిన పన్నులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ నగరంలోని 45వ డివిజన్ పరిధిలో 55వ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర రావు మాట్లాడుతూ ఎల్‌బిజి నగర్‌లో పేదలు గుడిసెలు కట్టుకుని జీవనం సాగిస్తున్నా రన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం సంవత్సరానికి 54 రూపాయలు మాత్రమే పన్ను వేయాలని, కానీ వీరికి 6నెలలకే రూ.2వేలు పైన పన్నులు వేస్తున్నా రన్నారు. నగరంలో పేదల గుడిసెలు, రేకుల ఇళ్లకు 54 రూపాయలే పన్ను వేస్తున్నారని, కానీ 55వ సచివాలయం పరిధిలో మాత్రం వేలాది రూపాయలు పన్నులు వేయడం విడ్డురంగా ఉందన్నారు. ఎల్.బాగ్యలక్ష్మి అసెస్ మెంట్ నెంబర్ 1093063833 కు రూ.4,382పన్ను, సిహెచ్ మేరీ (అసెస్ మెంట్ నెంబర్ 1093063793)కు రూ.2876 పన్ను వేశార న్నారు. ఇలా పన్నులు కట్టమని నోటిసులు పంపడం సరైనది కాదని, తక్షణమే ప్రభుత్వం జిఓ ప్రకారం 54 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణకు వినతి అందజేశారు. సమస్య పరిస్కారం కాకపోతే మున్సిపల్ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సరస్ డ్వాక్రా బజారు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

సమన్వయంతో సరస్ నిర్వహణ

ప్రజాశక్తి, విజయనగరం కోట

ఈనెల 28 నుంచి ట్యాంక్‌బండ్ రోడ్డులో నిర్వహించనున్న సరస్ ఎగ్జిబిషన్‌ను సమన్వయంతో విజయవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్‌పాణి అన్నారు. బుధవారం డిఆర్‌డిఎ కార్యాలయంలో డిపిఎంలు, ఎపిఎంలతో సరస్ ఎగ్జిబిషన్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. విద్యుత్, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక శాఖ వారితో సమన్వయం చేసుకొని ఎటువంటి అంతరాయం లేకుండా పక్క ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శానిటేషన్, క్లీనింగ్,మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు మున్సిపల్ కమిషనర్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సరస్ లో ప్రత్యేక ఆకర్షణగా ఫ్లవర్ షో ఉద్యానవనం శాఖ సమన్వయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. సరస్‌కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డితో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ డ్వాక్రా బజార్‌లో స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు తయారు చేసిన చేనేత హస్త కళలు, చేనేత ఉత్పత్తులు, గృహ అలంకరణలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు అమ్మకాలు జరుగుతాయని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఎపిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు ఘనంగా వేడుకలు జరిగాయి. పర్యాటక రంగం ద్వారా సుస్థిర మార్పును సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి వివిధ పోటీలు నిర్వహించారు. స్లో సైకిల్ రేస్, పోస్టర్ పోటీ, వేస్ట్ టు వండర్స్ వంటివి విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీలు పర్యావరణ పరిరక్షణ, సృజనాత్మకతపై అవగాహనను పెంచేవిగా నిలిచాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని ప్రముఖులు పర్యాటక రంగం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతాప్ కేశరి దాస్ మాట్లాడుతూ, పర్యాటకం స్థానిక సమాజాలను బలోపేతం చేస్తుందని అన్నారు. లైబ్రేరియన్ శంకర్ రెడ్డి కోలే, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, రిజిస్ట్రార్ తదితరులు మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

నగదు అందిస్తున్న కర్రోతు బంగార్రాజు

దసరా ఉత్సవాలకు విరాళం

ప్రజాశక్తి - భోగాపురం

దసరా పండగను పురస్కరించుకొని పోలిపల్లిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా ఏపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అమ్మవారి ఉత్సవాల కోసం రూ.55వేలు నగదును బుధవారం తన స్వగృహంలో విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలన్న ఉద్దేశంతోనే ఈ విరాళం అందించానని చెప్పారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు అశ్విత

ప్రజాశక్తి - బొండపల్లి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పాడి అశ్విత రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఆదివారం విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ సెలక్షన్‌లో 600 మీటర్ల పరుగు పందెంలో అశ్విత ప్రథమ స్థానంలోనూ, లాంగ్ జంప్‌లో రెండో స్థానంలోనూ విజయం సాధించి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఏలూరు జిల్లాలో జరుగబోయే రాష్ట్ర స్థాయి క్రీడల పోటీల్లో పాల్గొననుంది. కాగా వ్యాయామ ఉపాధ్యాయులు గెద్ద గురునాయుడు, సింగిడి గురునాథం శిక్షణలో పాడి అశ్విత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, పాఠశాల చైర్మన్ బాలి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఎంపిపికి ఘన సత్కారం

ప్రజాశక్తి- గంట్యాడ

ఎంపిపిగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఎంపిపి పీరుబండి హైమావతిని మండల నాయకులు, మండల సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లుగా తనను ముందుకు నడిపించినందుకు అందరికీ అభినందనలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లోని అభివృద్ధి పనులు చేశామన్నారు. 5వ సంవత్సరంలో అడుగు పెడుతున్న తరుణంలో అందరూ తమకు సహకరిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపిస్తానని చెప్పారు. ఎస్‌సి సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్ మాట్లాడుతూ ఎన్ని సమస్యలు వచ్చినా బొత్స సత్యనారాయణ, అప్పలనర్సయ్య వెనుకాలే ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వరి నరసింహమూర్తి, వైస్ ఎంపిపి సుంకర సుజాత, ఇంఛార్జి ఎంపిడిఒ ఎం.రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శుల నూతన మండల కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా ధనుంజయ్, ఉపాధ్యక్షులుగా ఎర్రిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎ.దిలీప్‌కుమార్, కోశాధికారిగా కె. శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి. కవిత, కార్యవర్గ సభ్యులుగా గణేష్, లోకేష్, శారదలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, కార్యదర్శుల సమస్యలను పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు.

మొక్కజొన్న రైతులకు రాయితీలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మొక్కజొన్న రైతులకు రాయితీలు ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉత్తరాంధ్రలో రైతులు చెరకు సాగుపై ఆధారపడి జీవనం సాగించే వారని, చక్కెర పరిశ్రమలు దివాళా తీయడంతో రైతులు చెరకు సాగు చేయకుండా మొక్కజొన్న సాగు వైపు మళ్లారని చెప్పారు. మొక్కజొన్నను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రాయితీలు ఇవ్వాలన్నారు. రైతులు ఎక్కువగా టేకు, ఎర్రచందనం, శ్రీగంధం మొక్కలు పెంచుతున్నారని, రైతులకు నకిలీ మొక్కలు వ్యాపారులు ఇవ్వడంతో నష్టపోతున్నారని చెప్పారు. వాటి సాగుపై ఉద్యావన శాఖాధికారులతో అవగాహన కల్పించాలని కోరారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారీ షుగర్స్‌లో బుధవారం రాజాం ఫైర్ అధికారి పైల అశోక్ ఆధ్వర్యంలో ఫైర్ అండ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. సుగర్స్ యాజమాన్యం, కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందితో అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, హోసులు వాడకం నిర్వహణపై ఫైర్ అధికారి, సిబ్బంది ప్రాక్టికల్ గా చూపించారు. ఈ సందర్భంగా వారు అనుకోకుండా ప్రమాదాలు జరిగితే ఫైర్ అండ్ సేఫ్టీ విధానం ఎలా ఉపయోగించాలో అర్థమయ్యే విధంగా స్వయంగా కార్మికులతో చేయించి అవగాహన కల్పించారు. హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎఒ శ్రీలక్ష్మి

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమాచార హక్కు చట్టంపై ఎఒ పి.శ్రీలక్ష్మి బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాల యంలో వ్యవసాయ సిబ్బందికి అవగా హన కల్పించారు. చట్టం ప్రాముఖ్యత, దాని ఉపయోగం, దరఖాస్తు విధానం గురించి వివరించారు. ఈ చట్టం వారి వృత్తిపరమైన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి, గ్రామీణ ప్రజలకు సమాచారం అందించడంలో సహాయపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రమేష్ , గ్రామస్థాయి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఎన్ని ఎకరాలున్నా ఒకే యూరియా బస్తా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదల రైతు సేవా కేంద్రాల్లో బుధవారం యూరియా పంపిణీలో రైతుల వద్ద వన్‌బి ప్రాప్తికి ఎన్ని ఎకరాలు ఉన్న ఒకే ఒక యూరియా బస్తా వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. దీంతో రైతులు వాదించారు.. కనీసం రెండు బస్తాలు ఇస్తే సరిపెట్టుకుంటామని మొరపెట్టుకున్నా ససేమిరా అని అధికారులు అనడంతో రైతులు ఏమి చేయలేని పరిస్థితిలో వెనుదిరిగారు. ఈ యూరియా పంపిణీని తహశీల్దార్ ఐ. కృష్ణలత పరిశీలించారు. యూరియా కోసం రైతులు అధిక సంఖ్యలో రావడంతో పోలీసులను రప్పించి క్యూ లైన్ ఏర్పాటు చేసి యూరియాను పంపిణీ చేశారు. పూర్తిస్థాయిలో యూరియా తెప్పించాలని కోరారు. వీరితో సర్పంచ్ కుప్పిలి దుర్గా గవరయ్య ఉన్నారు.

పి4 సర్వేపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పి 4 సర్వేపై సచివాలయం సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారు కుటుంబాల గుర్తింపు వాటి అనుసంధానం వంటి అంశాల పై శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.సుద ర్శనం, డిప్యూటీ ఎంపిడిఒ కె. శంకరజగన్నాథ్, రాష్ట్ర ప్రణాళికా డిపార్ట్మెంట్ నుంచి యంగ్ ప్రొఫిసినల్ జి.శ్రీధర్, సివిఎపి టీం సభ్యులు, మహేంద్ర, శిక్షణ పొందిన ఎంఒటిలు, 10 టిఒటిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పి4 సర్వేపై సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, ఎఒ, నియోజకవర్గ డిపిఒ మోనటరింగ్ అధికారి రేవతి, ఎఎస్ఒ, ఎంఇఒ పి.బాల భాస్కరరావు, వెలుగు ఎబిఎన్ సన్యాసిరావు, వి.పైడ్రాజు, వై సురేష్, మండల స్వచ్ఛ కోఆర్డినేటర్ జి. రాంబాబు పాల్గొన్నారు.

నగరంలో పండగ శోభ

- ముమ్మరంగా సుందరీకరణ పనులు
- పలు చోట్ల రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విద్యుత్తు కాంతుల్లో సాంస్కృతిక వైభవం

పైడితల్లమ్మ జాతర సమీపిస్తున్న తరుణంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ మరమ్మతు, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయనగరం నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది రోడ్డు గుంతలు పూడ్చివేత, రహదారుల మరమ్మతులు, కాలువల నిర్మాణ పనులు, డివైడర్లకు రంగులు అద్దే ప్రక్రియలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. శివాలయం వీధి, కొత్తపేట, దాసన్నపేట, పోలయ్యపేట, ఇప్పిలి వీధి తదితర ప్రాంతాలలో రహదారి మరమ్మతు పనులను చేపడుతున్నారు. డివైడర్లకు ఉన్న గ్రిల్స్‌కు ఆకర్షణీయమైన రంగులను అద్దుతున్నారు. 39వ డివిజన్ వివేకానంద కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. 27వ డివిజన్ జొన్న గుడ్డి ప్రాంతంలో జెసిబి సహాయంతో పైప్ లైన్లు ఏర్పాటు అనంతరం ఉన్న వ్యర్థ నిర్మాణ సామాగ్రిని తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. గురజాడ అప్పారావు రోడ్డు ప్రాంతంలో గుంతలు పూడ్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. రింగ్ రోడ్డు ప్రాంతంలో డివైడర్లకు ఉన్న గ్రిల్స్‌కు రంగుల అద్దే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించారా లేదా అన్న విషయాన్ని ఈఈ ప్రసాదు సిబ్బందితో పరిశీలించారు. ఆర్ అండ్ బి జంక్షన్ వద్ద జరిగిన పనుల నాణ్యతను గమనించారు. మూడు లాంతర్లు నుండి కోట వరకు ఉన్న రహదారి గోతులను పూడ్చివేస్తున్నారు. 2వ డివిజన్ హాజీ అలీ నగర్‌లో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. మరో వైపు మూడు లాంతర్లను ఆకర్షణీయంగా తయారు చేశారు. ఇంకో వైపు సాంస్కృతిక విజయనగరం పేరుతో ఆకర్షణీయంగా విద్యుత్ వెలుగులతో కూడిన జంక్షన్‌ను ఆకర్షణీయంగా తయారు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో అన్ని ప్రాంతాలలో మరమ్మతు పనులు, ఇతర నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికను చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంటున్నామన్నారు.

కొత్తపేట వద్ద నూతనంగా వేసిన రోడ్డు

వంతెన శిథిలం

- అడుగడుగునా గుంతలతో భయాందోళన
- పిచ్చి మొక్కలతో నిండుకున్న వంతెన
- వర్షపు నీరు వెళ్లే రంధ్రాలు మట్టితో మూసివేత
- పాలకొండ-విశాఖ ప్రధాన రహదారి బ్రిడ్జి దుస్థితి

ప్రజాశక్తి- రేగిడి

పాలకొండ- విశాఖపట్నం ప్రధాన రహదారి రేగిడి మండలం సంకిలి నాగావళి నది వంతెన శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి పొడవునా ఇరువైపులా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు వంతెనకు రెండువైపులా రంధ్రాలకు మట్టి కూరుకు పోవడంతో వర్షం పడితే నీరు కిందకు వెళ్లకుండా నిల్వ ఉండిపోవడంతో వంతెన పూర్తిగా శిథిలమైంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు, పాదాచారులు నానా అవస్థలు పడుతున్నారు. వంతెన పైభాగంలో గత నాలుగు నెలలుగా పచ్చ గడ్డి మొలవడంతో వంతెన మరింత పాడైపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ వంతెన 1984లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి టి.అంజయ్య ప్రారంభించారు. 40 ఏళ్లు పూర్తయిన వంతెన నిర్వహణను ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. దీనికి తోడు పిచ్చి మొక్కలు వంతెన ఇరువైపులా ఏర్పడడంతో వర్షానికి పడిన నీరు వంతెన పైన ఉండి పోవడంతో గుంతలు కనిపించక వాహనదారులు అందులో పడి గాయపడుతున్నారు. అసలు ఈ వంతెనకు పాలకొండ ఆర్అండ్‌బి అధికారులు నిర్వహణ పట్ల బాధ్యత లేకపోవడంతో ఇంత విలువైన వంతెన గుంతలమయమై శిథిలమైనట్లు తెలిస్తోంది. ఈ వంతెన మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. పూర్తిగా శిథిలమైన ఈ ఎంతెన కూలిపోయి ఏదైనా ప్రమాదం జరిగితే ఆర్అండ్‌బి అధికారులు భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సంకిలి వంతెన దుస్థితిపై విచారణ జరిపి పెద్ద పెద్ద గుంతలను మరమ్మత్తులు జరిపి, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

వంతెన పై భాగంలో ఏర్పడ్డ గోతులు

వంతెనపై ఏర్పడ్డ గోతులు, పిచ్చి మొక్కలు

ప్రతి బిడ్డకూ తల్లిపాలే మొదటి టీకా

ప్రజాశక్తి - చీపురుపల్లి

పుట్టే ప్రతి బిడ్డకూ తల్లిపాలే మొదటి టీకాగా పనిచేస్తాయని చీపురుపల్లి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శశికళ వివరించారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని విజయ కాలనీలో అంగన్వాడి సెంటర్ వద్ద తల్లులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని తల్లిపాల విశిష్టత గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ భారతి, ఆశా వర్కర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ విమలారాణి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్ 2 సచివాలయంలో హెల్త్, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.త్రినాధమ్మ, డాక్టర్ శిరీష, చైర్మన్ బంగారు సరోజిని, వార్డ్ కౌన్సిలర్ సత్యనారాయణ, లక్ష్మణరావు, అంగన్వాడి కార్యకర్తలు రమాదేవి, శాంతి, విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మంచి ఆరోగ్యం, మానసిక ఆనందం కోసం పోషకాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు టి.జానకి అన్నారు. బుధవారం మండలంలోని పాత శ్రీరంగరాజపురం గ్రామ సచివాలయం వద్ద పోషకాహార స్టాల్‌ను అంగన్వాడి కార్యకర్తలు ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, పప్పులు, కూరగాయలుతో కలిసి ప్రదర్శన పెట్టారు. అనంతరం మహిళలకు, చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడుపు నాయుడు, కామునాయుడు, అంగన్వాడి కార్యకర్తలు ఊర్మిళ, పద్మ, మహిళా పోలీసు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ: ప్రతి తల్లీ సున్నా నుంచి రెండు సంవత్సరాల పిల్లల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఐసిడిఎస్ పీడీ టి.విమలరాణి అన్నారు. కొటారుబిల్లి జంక్షన్ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ మహ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బోనంగి గ్రామంలో పోషణ మహ కార్యక్రమానికి సిడిపిఒ ఉమాభారతి హాజరై మాట్లాడారు. సెక్టర్ సూపర్‌వైజర్ గాయత్రిదేవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. వీటిని బిడ్డకు ఆరు నెలల వరకు ఇస్తే దృడంగా తయారవుతారన్నారు. పెదమజ్జిపాలెం ప్రభుత్వ వైద్యులు సతీష్ కుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే టీకాలను సకాలంలో వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చీపురుపల్లి: తల్లిపాలు గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ శశికళ

గుర్ల: ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదిగా ఉంటుందని సిడిపిఒ ఆరుద్ర అన్నారు. పోషణ మసోత్సవంలో భాగంగా బుధవారం పల్లిగండ్రేడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆరోగ్య సిబ్బంది సమక్షంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పోషణ మాసోత్సవంలో ఐవైసిఎఫ్ యాక్టివిటీలో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్ వైజర్, పాల్గొన్నారు.

జిన్నాంలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని జిన్నాం గ్రామంలో బుధవారం ఎఒ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంటియు 1121 వరి వంగడంపై పురుగు మందులు, ఎరువులు 'ఆత్మ' సౌజన్యంతో డ్రోన్ సహాయంతో పిచికారీ చేసే విధానంపై రైతులకు వివరించారు. డ్రోన్ సహాయంతో ఎరువులు పిచికారీ చేయడం వల్ల శ్రమ తక్కువగా ఉండటంతో పాటు, ఖర్చు తక్కువగా అవుతుందని సూచించారు. ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాకు డ్రోన్ సహాయం ద్వారా ఎరువులు పిచికారీ చేయడానికి 300 రూ. చెల్లిస్తే నేరుగా వాళ్లే వచ్చి పొలాల్లో డ్రోన్స్ స్ప్రెయిన్ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సతీష్, వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో ఎఒ టి.సంగీత అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి పంటలో పొటాష్ లోపం గుర్తించామన్నారు. దీని నివారణకు ఎకరం పొలానికి 15 నుండి 20 కిలోలు పొటాష్ ఎరువును వెయ్యాలని సూచించారు. వరి పంటలో పాముపొడ తెగులు గుర్తించామని దీని నివారణకు ఒక లీటర్ నీటికి 2 మిల్లీలీటరు హెక్సాకొనజోల్ మందు పిచికారీ చేయాలన్నారు. ముందున్న వర్షాకాలం రీత్యా రైతులు వ్యవసాయాధికారుల సూచనలు మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అచ్చింనాయుడు, వ్యవసాయ విస్తరణ అధికారి బి రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకులు జి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అబియాన్‌లో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి సింగరాయి, జగ్గయ్యపేట, అరిగిపాలెం గ్రామాల నుంచి 122మంది వైద్య సేవలు కోసం వచ్చారు. వేపాడ వైద్యాధికారి డాక్టర్ మల్లవేన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరావు, జగ్గయ్య పేట సర్పంచ్ వంటాకు రాములమ్మ, అరిగిపాలెం మాజీ ఎంపిటిసి డి. వెంకటరమణ, వెల్నెస్ సెంటర్ సిహెచ్ఒ పార్థసారథి, వేపాడ పిహెచ్‌సి హెచ్ఒ జిఎస్ఆర్ ఆంజనేయులు, సూపర్‌వైజర్ ఎస్.రఘు, హెచ్ఎజి సత్యనారాయణ, ఎమ్మెల్యే హెచ్‌పిలు, బి.పార్థసారథి, పి.రాజ్యలక్ష్మి, కె.లావణ్య, వి.మోహిని, సిహెచ్ జానకి, ఎఎన్ఎం భాను, పంచాయతీ కార్యదర్శి సత్యవతి, సచివాలయ సిబ్బంది, మూడు గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షులు ఎస్.కామేష్ పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలో బుధవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకట్ నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ ఎన్ వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తెర్లాం వైద్యాధికారులు డాక్టర్ పెద్దింటి వంశీకృష్ణ, డాక్టర్ రెడ్డి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ అనుహ్య, డాక్టర్ నవీన్ ఆయుష్ వైద్యాధికారి ఎస్. ఉమాదేవి 351 మంది మహిళలకు, రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎస్. వసంతరావు కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన 27 మందికి శస్త్ర చికిత్సలు కోసం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రిరికి ఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జి.ఆనందరావు, పిఎసిఎస్ చైర్మన్ నిర్సు పల్లి వెంకటరావు, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ మద్రాపు శంకరరావు, ఎంఇఒ జె. త్రినాథరావు, హెల్త్ విజిటర్ రాధ, వెల్నెస్ కేంద్రాల సామాజిక ఆరోగ్య అధికారులు, స్టాఫ్ నర్స్ ఝాన్సి, ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, ఆరోగ్య కార్యకర్త లక్ష్మణరావు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేపాడ : ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివిలో జాతీయ ఎన్ ఎస్ ఎస్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇన్‌ఛార్జ్ వైస్ - ఛాన్సలర్ ప్రొఫెసర్. డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. మానవాళి మనుగడకు ఈ మొక్కలు ఎంతగానో ఉపయోగ పడతాయని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటాలని అన్నారు. సుమారు 150 మొక్కలను క్యాంపస్‌లో నాటారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ మొక్కలను నాటిన తరువాత అవి పెరిగేలా కూడా చూడాలన్నారు. మొక్కలను నాటడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్. ఆర్.రాజేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ వి.మణి కుమార్, సీతం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్. ఎన్. సతీష్ కుమార్, వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కృష్ణ గురించి గాలిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

దొరకని పశువుల కాపరి ఆచూకీ

శ్రమిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

ప్రజాశక్తి- మెంటాడ

చంపావతి నదిలో మంగళవారం గల్లంతైన మెంటాడ గ్రామానికి చెందిన పశువులు కాపరి చల్ల కృష్ణ(43) ఆచూకీ కోసం చింతలవలస ఐదో బెటాలియన్ నుంచి వచ్చిన్ ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు బుధవారం గాలించాయి. రోజంతా నదిలో గాలించినప్పటికీ కృష్ణ ఆచూకీ కనిపించలేదు. రిసర్వ్ ఎస్ఐ కె.భాస్కరరావు నేతృత్వంలో 16మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి చంపావతిలో దాదాపుగా కిలోమీటరు పొడవున జల్లెడ పట్టారు. ఆచూకీ కోసం విరామం లేకుండా శ్రమించారు. సాయంత్రం చీకటి పడే వరకూ గాలింపు కొనసాగించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను విరమించారు. గురువారం కూడా గాలింపు చర్యలు కొనసాగిస్తామని, లైన్ సర్చ్, బోటు సర్చ్ చేపట్టామని ఎస్.ఐ భాస్కరరావు చెప్పారు.

రోటరీ ద్వారా సమాజానికి సేవ

ప్రజాశక్తి-విజయనగరం కోట

రోటరీ సంస్థ ద్వారా సమాజానికి సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రోటరీ పూర్వపు గవర్నర్ ఆర్.కె.జైన్ పిలుపునిచ్చారు. రోటరీ ఇంటర్నేషనల్ అవార్డు పొందిన సందర్భంగా బుధవారం స్థానిక కొత్తగ్రహారంలో ఉన్న రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జైన్ మాట్లాడుతూ రోటరీ సంస్థ ద్వారా విజయనగరం పట్టణానికి ఎనలేని సేవలు అందించే అవకాశం దక్కిందన్నారు. రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ విజయనగరంలో 25 రక్షిత నీటి పథకాల నిర్మాణం, స్వర్గధామం నిర్మాణం, వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం బెంచ్ థాన్ ప్రాజెక్ట్, రోటరీ బ్లడ్ బ్యాంక్ నిర్మాణం వంటి సమాజానికి సేవలు అందించిన ప్రాజెక్టుల నిర్మాణంలో ఆర్.కె.జైన్ కీలక భూమిక వహించారని ప్రశంసించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కృష్ణ శాంతి, డాక్టర్ మంచు కుమార స్వామి, డాక్టర్ వెంకటేశ్వరరావు, పద్మ కుమారి, మాటూరు మురళీకృష్ణ, సూర్యలక్ష్మి, రాధికారాణి, సుధాకర్, జ్యోతి బచావత్, నీతా విజ్వానీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో గల వంగపల్లి పేట గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మునాయుడు జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక కావడం పట్ల స్థానిక నాయకులు గ్రామస్తులు ఆయనను ప్రశంసిస్తున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైసిపి ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు లక్ష్మునాయుడును ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఎచ్చర్ల ట్రిబుల్ ఐటీలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా లక్ష్మునాయుడు విధులను నిర్వహిస్తున్నారు. లక్ష్మునాయుడును ఆదర్శంగా తీసుకొని యువత శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండాలని సూచించారు. ఈ నెల 14న విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని చెప్పారు. జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు డిసెంబర్ 14 ,15 తేదీలలో చండీగర్‌లో నిర్వహిస్తున్నట్లు లక్ష్మునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అలిగి శ్రీను, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, ప్రభాత్ కుమార్, యమ్ కృష్ణ, గెరిడి రామారావు, డబ్బాడ ఆనంద్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి ఎంపిటిసి

బొబ్బిలి: బాడంగి మండలం గూడెపువలస ఎంపిటిసి పూడి సింహాచలం, మాజీ సర్పంచ్ పూడి ఆనందరావు వర్గం వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కోటలో బుధవారం బుడా చైర్మన్ తెంటు రాజా వీరందరికీ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని రాజా అన్నారు. వీరితో పాటు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. టిడిపి బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలని రాజా కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిడిఒగా స్వరూపరాణి బాధ్యతలు

భోగాపురం: భోగాపురం ఎంపిడిఒగా డిడి స్వరూప రాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన కిషోర్ కుమార్ సెలవుపై వెళ్లడంతో ఇఒపిఆర్‌డి కె.గాయత్రి తాత్కాలికంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో మక్కువ మండలంలో ఎంపిడిఒగా పనిచేస్తున్న స్వరూపరాణి భోగాపురానికి బదిలీ కావడంతో కొత్తగా బాధ్యతలు చేపట్టారు.

వంగర ఎంపిడిఒగా రాజారావు బాధ్యతలు

వంగర: వంగర ఎంపిడిఒగా టి.రాజారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నందిగాం మండలంలో డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేస్తూ పదోన్నతి పైన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇంతవరకు ఎంపిడిఒగా పనిచేసిన రఘునాథచారి జలుమూరు మండలం ఎఒగా బదిలీపై వెళ్ళనున్నారు. వంగర మండలానికి పదోన్నతిపై ఎంపిడిఒగా వచ్చి బాధ్యతలు స్వీకరించిన రాజారావును మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు.

'లెండి'లో ముగిసిన ఎఫ్‌డిపి

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడలోని లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) అటల్ అకాడమీ సహకారంతో ఆరు రోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్- ఎఫ్‌డిపి) సోమవారంతో ముగిసింది. 'అధునాతన మానవ రోబోట్ సహకారం, డిజిటల్ సాంకేతికతల ద్వారా శక్తివంతమైన స్మార్ట్ తయారీ వికసిత్ భారత్ వైపు ఒక అడుగు' అనే అంశంపై ఈ నెల 15న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో యునైటెడ్ కింగ్‌డమ్, మలేషియా, భారత దేశాల నుండి మెకానికల్ విద్యా రంగంలోని ప్రముఖ నిపుణులు ఆన్‌లైన్ మీటింగ్ ద్వారా పాల్గొని పారిశ్రామిక విప్లవం 4.0, మానవ రోబోట్ సహకారం, డిజిటల్ ప్రతిరూపాలు (డిజిటల్ ట్విన్స్), కృత్రిమ మేధస్సు, విఆర్/ఎఆర్, సృష్టిశీల కృత్రిమ మేధస్సు (జనరేటివ్ ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతల ఉపయోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ సతీష్ పుజారి, కో-సమన్వయ కర్తగా ఐ.అనిల్‌కుమార్ వ్యవహరించారు. కళాశాల చైర్మన్ పి.మాధుసుదనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె. శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, డాక్టర్ వి.అంజి రెడ్డి సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు.